కంది పప్పాయనమః..!

కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు పప్పన్నం కరువైంది. తాము అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యిందని సంబరాలు చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం పేదలకు కిలో కందిపప్పు కూడా రేషన్ షాపుల్లో పంపిణీ చేయడం లేదనే విమర్శలు మూటకట్టుకుంది. ఇప్పటికే ఇంటి వద్దకే రేషన్ రద్దు చేసిన ప్రభుత్వం కార్డుదారులను దుకాణాల వద్ద క్యూకట్టి నిరీక్షించాల్సిన దుస్థితికి తీసుకొచ్చింది.

- రేషన్ షాపుల్లో పంపిణీ నిల్
- అన్ని రకాల సరుకులు ఇస్తామని ఎసరు పెట్టిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో ఎక్కడా సరఫరా కాని వైనం
- మండిపడుతున్న కార్డుదారులు

గుడిపాల: అన్ని నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు లభించేలా మాల్స్‌లా రేషన్ షాపులను తీర్చిదిద్దుతామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. క్షేత్రస్థాయిలో పేద, మధ్య తరగతి ప్రజలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేయడం లేదు. మరోవైపు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో బియ్యం, పంచదార, కంది పప్పు, గోధుమ పిండి రేషన్‌షాపుల్లో పంపిణీ చేసేవారు. కిలో కందిపప్పు రూ.67లకే ఇచ్చే వారు.


కందిపప్పు

ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో ఇవి ఎప్పటి నుంచి ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

14 నెలలుగా ఎదురుచూపులే..!

చిత్తూరు జిల్లాలో 5.40 లక్షల రేషన్ కార్డులు


రేషన్ దుకాణం వద్ద వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారు

ఉన్నాయి. వీటికి సంబంధించి 1,370 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీరంతా ప్రతినెలా రేషన్ షాపుల్లో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులు కందిపప్పు వచ్చిందా? ఎప్పుడొస్తుంది? అసలు ఇస్తారా, లేదా? అని రేషన్ డీలర్లను ప్రశ్నిస్తున్నా సరైనా సమాధానం లభించడం లేదు. దీంతో కార్డుదారులు కూటమి ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.120 నుంచి 140 వరకు ధర పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు రేషన్ షాపుల్లో ఎప్పుడిస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇలా.. 14 నెలలుగా ఎదురుచూపులే వారికి మిగలడం తప్పితే పిడికెడు కందిపప్పు కూడా ఇచ్చిన పాపాన పోవడం లేదు.

కందిపప్పు లేదట!



రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్ చెబుతున్నారు. బయటి మార్కెట్‌లో ఫస్ట్ క్వాలిటీ కిలో కందిపప్పు 140 రూపాయల వరకు ఉంది. అంత రేటు పెట్టి కొనలేకపోతున్నాం. గతంలో రేషన్ షాపుల్లో కిలో రూ.67లకే కందిపప్పు ఇచ్చేవారు. ప్రభుత్వం ఇకనైనా రేషన్ షాపుల్లో కందిపప్పు పంపిణీ చేయాలి.

–విజయ, గుడిపాల

పప్పు సరఫరా చేయాలి



ఎన్నికలకు ముందు అన్ని సరుకులు రేషన్ షాపుల్లో ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. మాలాంటి పేదలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. బయట మార్కెట్‌లో అధికంగా రేట్లు ఉన్నాయి.

–లలిత, గుడిపాల

కార్మికుడికి వైద్యం చేయించండి


గాయపడిన కార్మికుడు తిరుమలేష్


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రమాదంలో గాయపడిన కార్మికుడు తిరుమలేష్‌కు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం తిరుమలేష్‌తో కలిసి ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వెదురకుప్పం మండలం యనమలమంద గ్రామానికి చెందిన తిరుమలేష్ ఆళ్లమడుగు విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్టు ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడని తెలిపారు. అతన్ని చిత్తూరు, తమిళనాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిపారు. అధికారులు ఇచ్చిన నగదు వైద్య సేవలకు చాలకపోవడంతో ఆస్పత్రిలో డిశ్చార్జి చేశారని తెలిపారు. బాధితుడికి న్యాయం చేయాలని అధికారులను కోరామన్నారు. వారు స్పందించి తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో పూర్తిగా చికిత్స అందిస్తామని హామీ ఇవ్వడంతో అక్కడికి తరలించామని వివరించారు. కార్యక్రమంలో సుధాకర్, హేమకుమార్, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందిస్తాం

గాయపడిన కార్మికుడికి మెరుగైన చికిత్స అందిస్తామని ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ ఈఈ సురేష్ తెలిపారు. తిరుపతికి డీఈ, ఏఈలను పంపించామని, వైద్య సేవలకు అయ్యే ఖర్చు మొత్తం అధికారులే భరిస్తారని వెల్లడించారు.

జాగ్రత్తలతో అధిక దిగబడులు

ఐరాల: వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటిస్తే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో వరలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మద్దిపట్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వర్మీకంపోస్టు ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట పెంపకం, వేప పిండి వాడకం, ఇతర ప్రాంతాల నుంచి సారవంతమైన మట్టిని తెచ్చి పంట పొలాల్లో వేయాలని సూచించారు. విచ్చలవిడిగా కాంప్లెక్స్ ఎరువులను వాడవద్దన్నారు. యాంత్రీకరణ పద్ధతుల్లో పంటలను సాగు చేయాలన్నారు. విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. మద్దిపట్లపల్లె పశువైద్యాధికారి పినాకపాణి మాట్లాడుతూ పశువుల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశుగ్రాసంపై యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పశువుల మేతకు అవసరమైన గడ్డిని పెంచేందుకు నూతన పద్ధతులు పాటించాలన్నారు.

గుడిపాలలో.

గుడిపాల; వేరుశనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. ఆమె బుధవారం క్రిష్ణజమ్మాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటల్లో ఎర పంటగా ఆముదం, కంచె పంటగా జొన్న పంటలు సాగుచేయాలన్నారు. అలాగే నీలిరంగు, జిగురు అట్టలు ఉపయోగించడం వల్ల పంటలను నాశనం చేసే పురుగులను నివారించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లింగాకర్షక బుట్టలు, వేపగింజల కషాయంతో పురుగులను తొలిదశలోనే నియంత్రించవచ్చని చెప్పారు.


గుడిపాల : రైతులకు వేరుశనగ పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరిలో నూతన వంగడాలు పరిశీలన

పూతలపట్టు(యాదమరి): మండలంలోని ఓ రైతు పంట పొలాన్ని జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ సందర్శించారు. బుధవారం ఆయన రైతులతో మమేకం కార్యక్రమంలో భాగంగా పి.కొత్తకోట రైతు సేవా కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన చెర్లోపల్లి గ్రామానికి చెందిన చెంగల్రాయరెడ్డి అనే రైతు తాను పండించిన వరిలోని వివిధ రకాల నూతన వంగడాలు బహురూపి, ఖాలానమక్, నవారా అనే రకాలను, సేంద్రీయ పద్ధతిలోని సాగును పరిశీలించారు. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా పంచగవ్య, వేస్ట్‌డీకంపోజర్‌తో సాగు చేస్తుండడంతో రైతును అభినందించారు. సమీకృత వ్యవసాయంలో భాగంగా నాటు ఆవులు, కోళ్లు, పుట్టగొడుగులు పెంపకానికి రైతు నిర్మించిన షెడ్డును పరిశీలించారు. అదే గ్రామంలో మురళీ అనే రైతు పొలంలోని స్పైరులీనా కేంద్రాన్ని సందర్శించారు. తయారీ విధానాన్ని, మార్కెటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెర్లోపల్లిలోని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమా, మండల వ్యవసాయాధికారి మధురవాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


వరి నూతన వంగడాలను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా మరుదు సోదరుల విగ్రహాల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): స్వతంత్ర సమర యోధులు, స్నేహం కోసం తమ ప్రాణాలను బ్రిటిష్ వారి చేతుల్లో త్రుణప్రాయంగా పెట్టిన మరుదు పాండియార్ సోదరుల విగ్రహాలను చిత్తూరు నగరంలోని గంగినేనిపార్కులో బుధవారం శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, రాష్ట్ర మొదలియార్ సంక్షేమ సంఘం మాజీ చైర్మన్ బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడుకు చెందిన సంఘం నేతలు ఏజీ షణ్ముగం, మురళీ, అరుణాచలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద ముఖ్య అతిథులుగా విచ్చేసి విగ్రహాలను ఆవిష్కరించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మరుదు పాండియార్ సోదరులు దేశ స్వాతంత్ర్యం కోసం, దేవాలయాల అభివృద్ధి కోసం చేపట్టిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిత్తూరు మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మొదలియార్ సంక్షేమ సంఘం నాయకులు షణ్ముగం, శేఖర్, సుందరం, బాలమురుగన్, దీపక్, ఎట్టేరి సంతోష్, బుల్లెట్ అప్పు, తమిళనాడులోని మొదలియార్ సంఘ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో నాయకులు

విద్యార్థులకు మరో ఏడాది శిక్షణ

కుప్పం: కుప్పం ప్రాంతంలో ఎంతో పాముఖ్యం పొందిన ద్రౌపది తిరునాళ్లు, కళలపై విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మరో ఏడాది పొడిగిస్తూ సంగీత నాటక అకాడమీ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ద్రౌపది తిరుణాళ్ల గురువులు పీసీ మణి, రాఘవులు, మాలతి తెలిపారు. గతంలో సంగీత నాటక అకాడమీ న్యూఢిల్లీ సభ్యులు ఎస్పీ భారతి కొత్తఇండ్లు గ్రామాన్ని సందర్శించి మరుగున పడుతున్న ప్రాచీక కళలపై విద్యార్థులకు శిక్షణ తరగతులపై శ్రీకారం చుట్టారు. ఏడాది పాటు శిక్షణా తరగతులు కొనసాగాయి. ఈ క్రమంలో శిక్షణా తరగతులు మరో ఏడాది పొడిగిస్తున్నట్టు అకాడమీ ప్రతినిధులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కొత్త ఇండ్లు గ్రామంలో ప్రాచీన కళలపై విద్యార్థులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు గురువులు తెలిపారు.


కొత్త ఇండ్లు గ్రామంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గురువులు

నిత్య పూజ భక్తిమార్గానికి పూలబాట

పూతలపట్టు(యాదమరి): ప్రతి గ్రామంలో ప్రజలు దేవాలయాల్లో, గృహంలో ప్రతి నిత్యమూ పూజలు చేయడం వలన భక్తిమార్గానికి పూలబాట వేసినవరు అవుతారని శ్రీభువనేశ్వరి పీఠాధిపతులు శ్రీకమలానంద భారతీస్వామి అన్నారు.బుధవారం ఆయన హిందూ దేవాలయాల యువ చైతన్య మహా పాదయాత్రలో భాగంగా మండలంలోని బత్తలవారిపల్లి, పంటపల్లి, నడింపల్లి, పోలవరం తదితర గ్రామాలలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన హిందూ నాగరికత, సనాతన ధర్మంపై ప్రజలకు వివరించారు. దేవాలయాలను, సంస్కృతిని, సమాజాన్ని మనమే రక్షించుకోవాలని అన్నారు. ప్రతీ గ్రామంలో భజనలు, కోలాటాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడంతో హిందూ సాంప్రదాయం బలపడుతుందన్నారు. అనంతరం పంటపల్లి గ్రామంలో పీఠాధిపతులు భజన సంకీర్తనలు పాడి భక్తులను ఉత్సాహపరిచారు.


భక్తులతో పీఠాధిపతులు

క్లుప్తంగా

విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి


విషజ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య తెలిపారు. ఆమె బుధవారం వైద్య సిబ్బందితో కలిసి తుమ్మిందపాళ్యం, పెద్దిశెట్టిపల్లె గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గునియా తదితర వ్యాధులు వస్తాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రతంగా వుంచుకోవాలని సూచించారు. రాత్రిళ్లు దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 24 గంటలు వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, సరస్వతి, రాజేశ్వరి, రాధిక, నందిని, గౌరమ్మ, అములమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత తెలిపారు. ఆమె బుధవారం మరకాలకుప్పం గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయించకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శశికళ, హైమావతి, రాధ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై అవగాహన ఉండాలి


సర్వేపై అవగాహన కల్పిస్తున్న చంద్ర

గుడిపాల: స్వామిత్వ సర్వేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో చంద్ర తెలిపారు. ఆయన బుధవారం స్వామిత్వ పంచాయతీలకు ఎంపికైన చిత్తపార, వసంతాపురం, మరకాలకుప్పం, నంగమంగళం, గట్రాళ్ల మిట్ట, ఏఎల్‌పురం పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు స్వామిత్వ సర్వేపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ముందస్తుగా ప్రతి గ్రామంలోనూ గ్రామకంఠం భూమి ఎంత ఉంది, అందులో ఎన్ని ఇళ్లు నిర్మించుకున్నారు తదితర వివరాలు తెలుసుకోవాలన్నారు. అవన్నీ పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికీ వెళ్లి కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. ఇకపై పనులు, కట్టడంతో పాటు ఇంటికి సంబంధించి డిజిటల్‌లో సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ విషయాలను గ్రామంలోని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

గర్భవతుల నమోదుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ టీం

తవణంపల్లె: గర్భవతుల నమోదుపై వైద్య సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని డీపీఎంఓ డాక్టర్ ప్రవీణ తెలిపారు. బుధవారం మండలంలోని కె.పట్నం సబ్‌సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సందర్శించింది. సచివాలయ సిబ్బందికి మెటర్నల్ చైల్డ్ హెల్త్, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ గర్భవతులకు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి సరైన వైద్యం సకాలంలో అందించాలన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనూష, డీఎస్ఓ ప్రసాద్, డీపీఓ రామ్మోహన్, తవణంపల్లె వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు గోపి, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నాగభూషణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్థసారథినాయుడుకు రాజ్‌భవన్ ఆహ్వానం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరానికి చెందిన దాత పార్థసారథినాయుడుకు రాజ్‌భవన్ ఆహ్వానం పలికింది. సామాజిక సేవలో ఆయన చేసిన విశిష్ట సేవకు, కోవిడ్ సమయంలో ఆయన చేసిన సేవా కార్యక్రమాలకు ఆయన్ను ప్రభుత్వం గుర్తించింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆయన్ను ఆహ్వానించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి


డైరెక్టర్ గురవయ్యకు స్వాగతం పలుకుతున్న ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీ శ్రీనివాసులు

పుంగనూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. ఆయన బుధవారం పుంగనూరులో పర్యటించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కావడం, డీటీఆర్, ఫెయిల్యూర్‌ను తగ్గించాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ సర్వీసులను సత్వరం మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాతో పాటు బకాయిల వసూళ్లపైనా దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీలు శ్రీనివాసులు, చిన్నబ్బ, ఏఈలు ఉమామహేశ్వరరావు, ధనుంజయమూర్తి, వెంకట్రమణ, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వేలు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

బైరెడ్డిపల్లె: సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. ఆయన బుధవారం లక్కనపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధన తదితర విషయాలపై ఆరా తీశారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, వైద్యాధికారిణి షాలిని, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

డీఎస్సీలో 85.29 మార్కులు సాధించిన రెడ్డిరాణి



రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ ఇందిరమ్మ కాలనీ కి చెందిన వి.రెడ్డిరాణి డీఎస్సీలో 85.29 మార్కులు సాధించి చిత్తూరు జిల్లానే మొదటి స్థానంలో నిలిచింది. ఆమెకు ఇంటర్ పూర్తి చేసిన వెంటనే తల్లిదండ్రులు తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లెకు చెందిన కుమార్‌రెడ్డికి ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. పెళ్లి చేశారు. తనకు బాగా చదువుకుని ఉద్యోగం చేయాలని వుందని భర్తకు చెప్పింది. అతను ఆమెను డీఎడ్ చదివించాడు. డీఎస్సీ పరీక్ష కోసం కోచింగ్‌కు పంపించాడు. ఈ క్రమంలో ఆమె (హాల్ టికెట్ 0160387) ఎస్‌జీటీ విభాగంలో డీఎస్సీ పరీక్ష రాసింది. ఇందులో 85.29 మార్కులు సాధించింది. డీఎస్సీలో మంచి మార్కులు సాధించిన రెడ్డిరాణిని పలువురు అభినందించారు.

బైక్ బోల్తా పడి వ్యక్తికి గాయాలు

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో బుధవారం ద్విచక్ర వాహనం బోల్తాపడి వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. సోమల మండలం కందూరుకు చెందిన అన్వర్‌బాషా(58) బైక్‌లో సొంత పనుల నిమిత్తం పుంగనూరు వస్తున్నాడు. ఎంబీటీ రోడ్డులో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. గాయపడిన అతన్ని స్థానికులు 108లో పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అన్నదాత సుఖీభవకు కొర్రీలు

- గుడిపాలలో 6,743 మంది రైతులు
- 4827 మందికే అందని సహాయం

గుడిపాల: అర్హత కలిగిన రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కొందరికే నిధులు విడుదల చేసింది. పలు నిబంధనలతో అనేక మందికి మొండిచేయి చూపింది. అర్హత వున్న రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. గత ప్రభుత్వం అర్హులందరికీ రైతు భరోసా ఇచ్చిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమ ఆశలపై నీళ్లు చల్లిందని రైతులు వాపోతున్నారు.

గుడిపాల: మండలంలో 6,743 మంది రైతులు వున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,400 మందికి రైతు భరోసా నిధులు జమ చేసింది. మిగిలిన వారికి సాంకేతిక కారణాలతో నిధులు జమచేయలేకపోయింది. ఈ క్రమంలోనే 2024 ఎన్నికలు వచ్చాయి. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. దాన్ని నమ్మిన రైతులు ఓట్లు వేసి గెలిపించారు. అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం తొలి ఏడాది అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలుచేయలేదు. ఈ ఏడాది పథకాన్ని అమలుచేసింది. ప్రభుత్వం విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో వేల సంఖ్యలో అర్హులైన రైతుల పేర్లు కనిపించడం లేదు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 4,827 మంది రైతులను అర్హులుగా ఎంపిక చేసింది. మిగిలిన 1,916 మంది రైతులను పథకానికి దూరం చేసింది.


వరి మడిని సిద్ధం చేస్తున్న రైతు

వెబ్‌ల్యాండ్ సాకుతో...

వెబ్‌ల్యాండ్‌లో పేర్లు ఉన్న వారికి మాత్రమే అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అంతేగాక కౌలు రైతు, కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఎంపిక, పది సెంట్ల లోపు భూమి ఉన్నవారు, ఆధార్ ఈ కేవైసీ, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం తదితర పనులను అధికారులు చేపట్టారు. ఈ క్రమంలో రైతుల ఫోన్లకు వచ్చే ఓటీపీ చెప్పాల్సి వుంటుంది. దీనిపై అవగాహన లేక వేలాది మంది రైతులు వేలిముద్ర వేయలేదు. రెవెన్యూ యంత్రాంగం అలసత్వం వల్ల 1,916 మంది రైతులు అర్హత కోల్పోయారు.

వ్యవసాయ కార్యాలయానికి క్యూకట్టిన రైతులు

పథకం నిధులు అందని పలువురు రైతులు వ్యవసాయ కార్యాలయం వద్దకు పరుగులు తీస్తున్నారు. గత ప్రభుత్వంలో తమకు రైతు భరోసా నిధులు పడ్డాయని, ఇప్పుడు ఎందుకు రాలేదని నిలదీస్తున్నారు. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ కార్డ్ లింక్ కానందున ఈ పరిస్థితి ఎదురైందని చెబుతున్నారు. రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి వెబ్ ల్యాండ్‌లో ఆధార్ లింక్ చేసుకుంటే అన్నదాత సుఖీభవ నగదు జమవుతుందని పేర్కొంటున్నారు. దీంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. దీనికితోడు ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయడానికి పెట్టుబడి సాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ మంది ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తున్నారు. గత ఏడాది నుంచి వ్యవసాయం భారంగా మారిందని, ఇలా అయితే పంటలు సాగు చేయడం కష్టమవుతుందని వాపోతున్నారు.

నేటి నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ సూరకుంట్ల సమీపంలోని మునీశ్వరస్వామి కొండపై గురువారం నుంచి 19వ తేదీ వరకు ఆడికృత్తిక ఉత్సాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా మునీశ్వరస్వామి, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామికి విశేష పూజలు, అభిషేకాలు, కావడి చెల్లింపు కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. చెక్కభజనలు, కోలాటాలు, వీధి నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు వుంటాయని తెలిపారు. కోగిలేరు జలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామికి కల్యాణం, కావళ్ల చెల్లింపు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్తలు పేర్కొన్నారు.